# మరో చరిత్ర

చరిత్ర! ఏది చరిత్ర?

నిన్నా, మొన్నా, ఆ మొన్నా, అంతకు ముందూ జరిగింది ఈనాటి చరిత్ర. ఈనాటి వార్తలూ, మన మనుగడా, జీవనసరళీ రేపటి చరిత్ర! మరి ఈ చరిత్రకి ఆధారాలు? పుస్తకాలూ తాళపత్రాలూ శిలా శాసనాలూ, వస్తు విశేషాలూ, ఎముకలూ బొమికలూ... ఏది దొరికితే అది. మరి ఈ చరిత్ర రాసేదెవరు?

చరిత్రకారులు. అంటే మన తెలుగు భాషలో హిస్టోరియన్స్. వాళ్ళేకాక ఆ చరిత్ర రాయటానికి దోహదపడే మనలాటి వాళ్ళు. మరి మనలాటి వాళ్ళు, మనలా గానే ఎవరి దారిన వాళ్ళు రాచుకుంటూ, రాసుకుంటూ, వ్రాసుకుంటూ పోతుంటే, మరి చరిత్ర సరిగ్గా చెప్పబడుతుందా లేక చరిత్రలో కలిసిపోతుందా?

నిజాలు దాచేసి ఎవరి ఇజాలకు తగ్గట్టు వాళ్ళు బాజాలు వాయించు కుంటుంటే, అసలు చరిత్ర మరో చరిత్ర అయిపోతుందా?

ఈనాటి చరిత్ర పుస్తకాలు చదివితే అర్థమైపోతుంది, మనం చదివేది చాలవరకూ మరో చరిత్ర, కొంతవరకూ మాత్రమే అసలైన చరిత్ర అని. మీరంత ధైర్యంగా ఎలా చెప్పగలరు అని అడిగే ముందు, ఒక్క క్షణం పుస్తకం మూసేసి మీరూ ఆలోచించండి. నాతో ఏకీభవిస్తారు.

మనం రెండు రకాలుగా చూద్దాం. ఈనాటి వార్తలు, సాహిత్యం, సినిమా ల్లాటివి ఇంకో నూటొక్క ఏళ్ళకో, నూట పదహారేళ్ళకో చదివేవాళ్ళూ, చూసేవాళ్ళూ, తెలుసుకునే వాళ్ళూ చరిత్రలో మన గురించి ఏమిటి, ఎలా తెలుసుకుంటారు అని. రెండవది మనకి తెలిసిన చరిత్ర ఎంతవరకూ నిజమూ అని.

ఒకే విషయాన్ని ఎన్నో కోణాల్లో చూడవచ్చు. అది మన ఇష్టాయిష్టాలని బట్టీ, విలువలనిబట్టీ, అప్పటి పరిస్థితులనిబట్టీ, అవసరాలనిబట్టీ, ఈరోజుల్లో అయితే ఇజాలనిబట్టీ వుంటుంది. ఇజాలంటే ఇంతకుముందు చెప్పుకున్నాం. కాపిటలిజం, కమ్యూనిజం, రేసిజం, నెపోటిజం, మనదేశంలో కాస్టిజం... ఇలాటివి మనకెన్ని బుద్ధులున్నాయో అన్ని వున్నాయి. మరి మనమే రచయితలమూ, పుస్తక ప్రచురణ కర్తలమూ, సినిమా దర్శకులమూ, చరిత్రకారులమూ అయితే ముందు తరాల వారికి ఎలాటి చరిత్ర అందిస్తాం? ఇజాలు నిజాలని నిజంగా బయట పెడతాయా అనేది పెద్ద ప్రశ్న. అసలు ఆ నిజాలన్నివి మనం ఎటు పక్కనించీ చూస్తున్నామన్న దాన్ని బట్టి వుంటుంది, మరి ఏ నిజం నిజంగా నిజమవుతుంది? ఇది నిజంగా ఈ సత్యానికి ఒకరోజు కలిగిన మందపాటి సందేహం. అందుకే నా స్వగతంగా ఈ వ్యాసం.

అమెరికాకీ సోవియట్ యూనియన్‌కీ చల్లటి యుద్ధం (కోల్డ్‌వార్) వేడివేడిగా ఎన్నో ఏళ్ళు జరిగింది. రకరకాల దేశాలు వాళ్ళ తమ కక్షల, రక్షణల అవసరాలనిబట్టి, ఇండియాతో సహా, రెండు పక్షాల వేపూ సర్దుకున్నాయి. మరి వాళ్ళు వ్రాసే చరిత్ర రెండు రకలుగా వుంటుంది అని తెలుస్తూనే వుంది. అలాగే

ఇజ్రాయిల్‌వారూ, పాలస్తీనువారూను. మన ముందు యుగాలవారు చదివే చరిత్రలో ఫలానావారు ఫలానా అప్పుడు పుట్టారు, ఫలానా యుద్ధం ఫలానా అప్పుడు జరిగింది అనే కాలక్రమ విషయాలు వాస్తవంగా చిత్రించబడతాయి. కానీ ఈ మహానుభావులు నిజంగా మహానుభావులా, అలా ఎందుకయారు, ఏ యుద్ధం ఎందుకు జరిగింది, కారణం ఎవరు ఇలాటివి రాసిన భాస్కరుల కలంలోని ఇంకు రంగునిబట్టి వుంటుం దనిపిస్తుంది నాకు. ఎవరికి ఎంత కావాలో ఎలా కావాలో, అంతే అలాగే వ్రాస్తారు.

ఇక జరిగిన చరిత్ర చూస్తే, తాజ్‌మహల్ కట్టించిన షాజహాన్ ఎవరో మనకి తెలుసుగానీ, రాళ్ళని మోసిన కూలీలు కాదు. అంటే ఆ రాళ్ళని మోసిన కూలీలందరి పేర్లు సినిమాలో టైటిల్స్‌లాగా వెయ్యమనికాదు. ఏమాత్రం సాంకేతిక పరికరాలు లేని రోజుల్లో, తాజ్‌మహల్, పిరమిడ్లులాటివి ఎలా కట్టగలిగారూ అన్నవి మనలాటి వారికి చెప్పే చరిత్ర లేదు. మన ఇండియా పాకిస్థాన్ల స్వాతంత్ర సమర చరిత్ర చూస్తే, ఎవరు హీరోలో ఎవరు జీరోలో, మీకు ఈ రెండు చరిత్రలు రెండు రకాలుగా ప్రస్ఫుటంగా చూపెడతాయి.

అమెరికాలో వ్రాస్తున్న, వ్రాసిన చరిత్ర మీద కూడా చాల వాగ్యుద్ధాలు జరుగుతున్నాయి. కొలంబస్ అమెరికాని కనుగొన్న విధానం విషయం దగ్గరనించీ, అమెరికాకి మొట్టమొదట యాత్రీకులుగా వచ్చిన కేథలిక్స్, రెడ్ ఇండియన్స్ అనబడే స్థానిక పూర్వీకులని చరిత్రలో చిత్రించిన తీరూ... ఇలా ఎన్నో ఎన్నెన్నో.

అమెరికాలో చరిత్రనే కాదు, ప్రెసిడెంటుని కూడా ప్రశ్నించే వెసులుబాటు, చర్చించే అలవాటూ వుంది కనుక, కొన్ని నిజాలు ఈ మరోచరిత్రల్లో నించీ బయటపడే అవకాశం వుంది. అలాగే డాన్ బ్రౌన్ వ్రాసిన డివించీ కోడ్ అనే పుస్తకం ఒక పెద్ద తుపాన్ లేపింది. పైన అనుకున్నట్టుగా మతగురువులూ, మతాన్ని మనసా వాచా పాటించేవారు ఒక రకంగానూ, చారిత్రక సత్యాన్వేషకులు ఇంకో రకంగానూ ఎవరి భాష్యం వాళ్ళు చెబుతూనే వున్నారు.

ఇలాటివి మన చరిత్రలోనూ వున్నాయి. కొందరు రామాయణ భారతాలు ఇతిహాసాలు మాత్రమేనూ అవి జరిగినవి కాదు అంటారు. కాదు అవి నిజంగా జరిగినవే, మరి రాముడు దేముడు కదా, ఆయన పుట్టినట్టు అయోధ్యలో ఆధారాలు, ఆయన పాదాలు రామేశ్వరంలోనూ వున్నాయి కదా కావాలంటే చూడండి అంటారు. మళ్ళీ ఇక్కడా నేను ఆ వివరాల్లోకి వెళ్ళటం లేదు. అభిప్రాయ బేధాలు వున్నాయని మాత్రమే చెబుతున్నాను.

మీకు ఆధారాలతో ఇదే అసలు చరిత్ర అని చెప్పటానికి నేను చరిత్రకారుణ్ణి కాదు. అదీకాక నా పేరులో నిజం వున్నా, నా ఇజం నాది.

కనుక మీ పరిధిలో మీరూ పరిశోధించండి - ఏది చరిత్ర, ఏది మరో చరిత్ర అని.

0 0 0